
సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 13 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | గురువారం | 17.04.2025




## 'కస్తూరి విజయం' స్ఫూర్తిదాయకం

వారంతా పేద కుటుంబాలకు చెందిన వారు.. సాధారణ విద్యార్థులు.. కానీ అంకితభావంతో చదువుకున్నారు. కఠినమైన సాధన చేసి తమ లక్ష్యాన్ని చేరుకున్నారు. అసాధారణ ప్రతిభతో విజయతీరాలను చేరిన కస్తూర్బా గాంధీ విద్యార్థుల గాథలే.. 'కస్తూరి విజయం'

2 లో



## సన్న బియ్యం పంపిణీ చరిత్రలో నిలిచిపోతుంది

- ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



3 లో




## స్కానింగ్ సెంటర్ల మూసివేత

- జిల్లాలో ఆరోగ్య శాఖాధికారుల తనిఖీలు

3 లో

wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

General News




## 'కస్తూరి విజయం' విద్యార్థులకు

# స్ఫూర్తిదాయకం

### కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** 'కస్తూరి విజయం'పుస్తకం విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. సమగ్ర శిక్షా, పాఠశాల విద్యా శాఖ ఆవిష్కరించిన కస్తూరి విజయం (కేజీబీవి విద్యార్థుల విజయగాథల) పుస్తకాన్ని బుధవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కు జీసీడీఓ గౌసియా బేగం, ఏపీఎం శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. 2004లో నెలకొల్పిన కేజీబీవీల్లో చదువుకుని వివిధ రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న 60 మంది పూర్వ విద్యార్థులను గుర్తించి, కస్తూరి విజయం అనే పేరుతో పుస్తకాన్ని సమగ్ర శిక్షా, పాఠశాల విద్యా శాఖ రూపొందించింది. ఈ పుస్తకంలో జిల్లాలోని వివిధ కేజీబీవీలలో చదువుకున్న ఆరుగురు పూర్వ విద్యార్థులకు చోటు దక్కడంతో వారికి కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. అదే విధంగా మరింత మంది పూర్వ విద్యార్థినుల వివరాలను సేకరించి, వారి విజయాలను ప్రస్తుత విద్యార్థినులకు తెలియజేసి, స్ఫూర్తిని కలిగించాలన్నారు. అలాగే ఆన్‌లైన్ లో నిర్వహిస్తున్న ఈఏపీసెట్, లాసెట్ శిక్షణ తరగతులకు విద్యార్థులు కచ్చితంగా హాజరు కావాలని, అలాగే పీజీసీఆర్టి తరగతులకు కూడా క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని, తద్వారా మంచి ర్యాంకులు సాధించేలా కృషి చేయాలని, అందుకోసం వారిని ఎంతగానో ప్రోత్సహించాలని సూచించారు.

### పిడుగు సరిత, సాఫ్ట్వేర్ ఇంజనీర్



వరంగల్ జిల్లాలో ఉన్న బందూతాపూర్ అనే కుగ్రామం నుంచి టెక్నాలజీ ప్రపంచంలోకి అడుగిడింది. గ్రామంలోని పాఠశాల మూసివేయగా, చదువుకోవాలనే కోరిక ఆమెను కేజీబీవీ బచ్చన్నపేటకు చేర్చింది. పదవ తరగతి పరీక్షల్లో మండల టాపర్ గా వచ్చింది. చెకుముకి వంటి రాష్ట్ర స్థాయి శాస్త్రీయ ప్రతిభా పరీక్షలలో పాల్గొని మెరుగైన స్థానాన్ని పొందింది. సరిత తన 10వ తరగతి పూర్తి చేసిన తర్వాత, ఇంజనీరింగ్ డిప్లొమాను ఎంచుకుంది. తరువాత ఆమె బిటెక్ డిగ్రీని కూడా పూర్తిచేసింది. ప్రాంగణ నియామకం ద్వారా ఇప్పుడు ఆమ్డాక్స్ ఐనా (Amdocs ina)లో విజయవంతమైన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా సరిత ప్రయాణం కేజీబీవీ అందించిన అవకాశాలను అందిపుచ్చుకుని, ఆవిష్కృతమైన ఫలితాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది.

### బానోతు ప్రియాంక, వ్యవసాయ విస్తరణాధికారి



కేజీబీవీ పాలకుర్తి నుంచి 2016లో పదో తరగతి ఉత్తీర్ణురాలై బయటకు వచ్చిన ప్రియాంక ప్రస్తుతం జనగామ పరిధిలో ఉన్న రామవరంలో వ్యవసాయ విస్తరణాధికారిగా పనిచేస్తోంది. తన ఉపాధ్యాయులు ఇచ్చిన ప్రోత్సాహం తననిపరీక్షలపై దృష్టి పెట్టేలా చేశాయి. మంచి గ్రేడులో ఉత్తీర్ణురాలైంది. లార్వా నుంచి అన్ని దశలను దాటుకొని సీతాకోక చిలుకగా మారేటటువంటి రూపాంతరీకరణకు ఏమాత్రం తగ్గని క్రమం పాలకుర్తి కేజీబీవీలో ప్రియాంక ప్రయాణం, ఆ ప్రయాణంలో కేవలం జ్ఞానార్జనే కాక భావి జీవితానికి అవసరమైన ఆత్మవిశ్వాసం, పట్టుదల, ఓపిక, భావప్రసారం, వెనుదిరగని వైఖరి వంటి నైపుణ్యాలను అందిపుచ్చుకుంది. వ్యవసాయ విస్తరణ అధికారిగా తన వృత్తి జీవితంలో 13,000 ఎకరాల భూమి, 11 గ్రామ పంచాయతీలు, 58,000 రైతులను పర్యవేక్షిస్తూ ఒక అద్భుతమైన పనిని ప్రియాంక నిర్వహిస్తోంది.

### గుగులోతు సంధ్య, ఎంబీబీఎస్ 2వ సంవత్సరం



జిల్లాలోని కొడకండ్ల మండలానికి సమీపంలోని హక్యా తండాకు చెందిన సంధ్య కొడకండ్లలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) లో అభ్యసించింది. ఆమె శాస్త్రీయ ప్రదర్శనలు, డిబేట్లు, డ్రామాలు వంటి వివిధ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేది, ఆ పోటీ తత్వమే ఆమె భవిష్యత్ సాధనలకు పునాది వేసింది. ఇంగ్లీష్ మీడియం అడ్డంకిగా ఉన్నా, నీట్ కోచింగ్ తీసుకొని, తన కుటుంబం, కేజీబీవి ఉపాధ్యాయ బృందం ఇచ్చిన నైతిక మద్దతుతో, పట్టువదలకుండా ఎంబీబీఎస్ ప్రవేశ పరీక్షలో నెగ్గి, మేడ్చల్లోని మెడిసిటీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ లో ప్రవేశించింది. అందరికీ వైద్యాన్ని అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా ఒక చిన్న గ్రామం నుంచి వైద్య కళాశాల వరకు పడిన ఆమె అడుగులు ఎందరో యువ విద్యార్థులకు స్ఫూర్తిదాయకం.

### పోచంపాదు యామిని, అసోసియేట్ సాఫ్ట్వేర్ ఇంజనీర్



ఒరియాలో 'ఇక్కత్, గుజరాతీలో 'పటోలా' తెలుగులో 'చిటికి', శతాబ్దాలుగా చేతులతో సృష్టిస్తున్న అద్భుతం! ఈ మాటనగానే వెంటనే గుర్తుకు వచ్చే ఊరు పోచంపల్లి. ఇది చేనేత కళాకారులకు, ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఇక్కత్ డిజైన్లకు పెట్టింది పేరు. అటువంటి పోచంపల్లి చేనేతకారుల కుటుంబం నుంచి వచ్చిన యామిని, తన గ్రామంలో 6వ తరగతి చదువుతున్నప్పుడు, జనగామలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం గురించి విని ఈ పాఠశాలలో అడుగుపెట్టింది. ఆమె ప్రతిరోజూ ఆంగ్ల దినపత్రికను చదివి, వార్తలను ప్రార్థన సమయంలో చదవడానికి ఉత్సుకత చూపేది. ఆమె తన 10వ తరగతి పరీక్షలో 9.7 గ్రేడును సాధించింది. పదవ తరగతి తరువాత పాలిసెట్ రాసి, మాసబ్ ట్యాంక్ లోని యూనివర్సిటీ పాలిటెక్నిక్ కాలేజీలో సీటు సాధించింది. ఈసెట్ ద్వారా జెఎన్టియు కూకట్ పల్లిలో బీటెక్ సాధించింది. ఈ రోజు యామిని యాక్సెంచర్ సొల్యూషన్స్ లో ఒక అసోసియేట్ సాఫ్ట్ వేర్ ఇంజనీర్. ఆమె ప్రయాణం కేవలం వ్యక్తిగత విజయం మాత్రమే కాదు, సమాజంలోని ఆడపిల్లలు బలమైన, స్వతంత్ర మహిళగా ఎలా రాణించాలో పరివర్తన కలిగిస్తోంది.

### బిట్ల లిఖిత, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్



జిల్లాలోని లింగాలఘణపూర్‌కు చెందిన లిఖిత, కేజీబీవీ లింగాలఘణపూర్‌లో విద్యనభ్యసించింది. 18 ఏళ్ల వయసులోనే అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ గా ఉద్యోగాన్ని సాధించింది. సమాజంలో అంతర్లీనంగా ఉన్న అడ్డంకులను బద్దలు కొట్టింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా ఆమె ప్రయాణం భావి యువతకు మార్గనిర్దేశం చేస్తుంది.

### పాము విద్య, రిలేషన్ షిప్ మేనేజర్, ఐసీఐసీఐ బ్యాంక్




జనగామ ప్రాంతంలో ఒక నేతకారుల కుటుంబంలో పుట్టి, మొదటి ఇంజనీర్ గా ఎదిగిన ఆమె ప్రయాణం ప్రేరణ కలిగిస్తోంది. కేజీబీవీ చౌడారం పాఠశాలలో చేరింది. 10వ తరగతిలో 9.7/10 స్కోర్ చేసింది. తరువాత ఇంజనీరింగ్ పూర్తిచేసి, ప్రస్తుతం ఐసిఐసిఐ బ్యాంక్ రిలేషన్ షిప్ మేనేజర్ గా పనిచేస్తోంది.



# సన్న బియ్యం పంపిణీ చరిత్రలో నిలిచిపోతుంది

## పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండల కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి బుధవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. నియోజకవర్గానికి గెలిచినప్పటి నుండి రూ.1450 కోట్ల నిధులు తీసుకొచ్చానని, అనేక అభివృద్ధి పనులు నిర్మాణాల్లో ఉన్నాయన్నారు. పాలకుర్తి లో 50 పడకల ఆసుపత్రిని ఆప్గ్రేడ్ చేశామని, రాయపర్తి టౌన్ పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు నిధులు కేటాయించామన్నారు. పెద్దవంగర లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాలలో ఉన్నాయని, సొంత భవనాలు కట్టించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇన్ని రోజులు ఏం డెవలప్ అయిందో మాజీ మంత్రి దయాకర్ రావుకు చెప్పాల్సిన అవసరం లేదన్నారు. అభివృద్ధి చేసి చూపిస్తున్నామని, పాలకుర్తి, చెన్నూరు రిజర్వాయర్ లను పూర్తిచేసేలా కృషి చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ ను తక్కువ అంచనా వేయొద్దని, అభివృద్ధి ప్రధాన లక్ష్యం అన్నారు. రానున్న లోకల్ బాడి ఎలక్షన్ లో ప్రతి ఊరిలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయ మన్నారు. ఆదరిస్తున్న పాలకుర్తి ప్రజలకు ఎప్పుడు రుణపడి ఉంటాననీ, సన్న బియ్యం అనేది చరిత్రలో నిలిచిపోతుందన్నారు. బారాసా చోట మోటా లీడర్లు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని ఎమ్మెల్యే హెచ్చరించారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**పాలకుర్తి, మన చౌరాస్తా :** పాలకుర్తి మండల కేంద్రంలో ఎఫ్‌పిసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అన్నదాతలకు తగిన మద్దతు ధరను అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. మధ్యవర్తులు లేకుండా, పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ సాగుతుందన్నారు. కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ విధమైన కేంద్రాలు ఎక్కువగా ఏర్పాటవడం సంతోషకరమనీ,. ఇది రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకుంటున్న దన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ ఝాన్సి రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ సహకారంతో వారిని ఆర్థికంగా



బలోపేతం చేయడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉన్నా మన్నారు. పాలకుర్తి ఏఎంసీ చైర్మన్ మంజుల, బ్లాక్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్, డైరెక్టర్లు, మాజీ ఎంపీపీ లు శ్రీనివాస్, యకస్వామి, సీనియర్ నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, యకంతరావు, కృష్ణమూర్తి, పులి గణేష్, ఆదినారాయణ, భాస్కర్, భార్గవ్ పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం షురూ

లింగాలఘణపురం, మన చౌరాస్తా : లింగాల ఘనపురం మండలంలోని కుందారం, గుమ్మడవెల్లి, కళ్లెం, ఏనేబావి గ్రామలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొల్లూరి నర్సింహులు (శివ కుమార్) మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెంటర్లలోనే వడ్లను అమ్ముకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు, డైరెకర్లు, ఏఎంసీ డైరెక్టర్లు, సమన్వయ కమిటీ సభ్యులు, మండల నాయకులు, రైతులు, ఆయా గ్రామ శాఖ అధ్యక్షులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.






# స్కానింగ్ సెంటర్ల మూసివేత

## జిల్లాలో ఆరోగ్య శాఖాధికారి తనిఖీలు

**జనగామ, మన చౌరాస్తా :** ఇటీవల విజయా స్కానింగ్, డయాగ్నొస్టిక్ సెంటర్, జనగామపై వచ్చిన ఆరోపణలపై విచారణ నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంహెచ్‌వో డా.మల్లిఖార్జున్ రావు ఆధ్వర్యంలో బుధవారం వైద్యశాఖ తనిఖీలు నిర్వహించింది. విజయ స్కానింగ్ సెంటర్ ను 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజుల పాటు మూసి వేయడంతో పాటు రూ.50 వేల జరిమానా విధించినట్టు డీఎంహెచ్‌వో తెలిపారు. అలాగే రిజిస్ట్రేషన్ లేకుండా నడిపిస్తున్న సిటీ ఐ కేర్ అండ్ ఆప్టికల్స్‌ను మూసివేసినట్టు తెలిపారు. నిబంధనలు పాటించని వారు ఎంత వారైనా సరే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో హెచ్చరించారు. తనిఖీల్లో డా.రవీందర్ గౌడ్, డా.కమల్ హసన్, ఎం.ప్రభాకర్ మాస్ మీడియా అధికారి, పి.ప్రభాకర్ పాల్గొన్నారు.




# మత్తడి స్థలం సాధించే వరకు మా పోరాటం ఆగదు

## సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వెంకటమావో

**చేర్యాల, మన చౌరాస్తా :** చేర్యాల మండల కేంద్రంలోని పెద్ద చెరువు మత్తడి స్థలాన్ని సాధించే వరకు తమ పోరాటం ఆగదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకటమావో, చేర్యాల పట్టణ కమిటీ సభ్యులు బోయిని మల్లేశం అన్నారు. మత్తడి స్థలాన్ని ఆక్రమించి, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకుని పశువుల అంగడిని లేకుండా చేసిన మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి కుమార్తె పిట్లూరి తుల్జాభవాని రెడ్డి, కొండగట్ల మారుతి ప్రసాద్, అన్నం జితేందర్ రెడ్డి అక్రమ పట్టాను రద్దు చేయాలని తిరిగి ఈ స్థలాన్ని చేర్యాల మున్సిపాలిటీకి అప్పగించాలని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహించారు. ఈ క్రమంలో హైదరాబాద్ లోకాయుక్త కోర్టులో న్యాయ విచారణ కోసం కేసు వేసిన వారు బుధవారం రోజున లోకాయుక్త కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొంగరి వెంకట మావో మాట్లాడుతూ సిపిఎం పార్టీ చేర్యాల ప్రాంత ప్రజల వైపున నిలచి పోరాడుతుందని ఎన్ని ఇబ్బందులు , కష్టాలు తలెత్తిన ప్రజల అభిమానంతో, ప్రజల ఆదరణతో న్యాయాన్ని గెలిపించే విధంగా అవినీతిని అక్రమాలను అంతం చేసేందుకు సిపిఎం కార్యకర్తలం నిరంతరం పోరాడుతారన్నారు. ఈ పోరాటానికి చేర్యాల ప్రాంత ప్రజలు, మేధావులు, ప్రగతిశీల వాదులు చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. గతంలో తుల్జా భవాని రెడ్డి ఈ స్థలాన్ని ప్రజలకు తిరిగి ఇచ్చేస్తానని చేసిన వాగ్దానాన్ని నిలుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.

